# అస్పష్ట చిత్రం

అతన్ని చూసినపుడల్లా నాకనిపిస్తూంటుంది ఏదో ఒక పురాతనమైన చినిగి ఛిద్రమైనఅద్భుత స్వప్నాన్ని కప్పుకుని తిరుగుతూంటాడు అని.

సాయంత్రపు గాలుల్తో మాట్లాడ్తూ పూరపిచ్చుకల గుంపుల్లో దూరుతూ, ఉదయ కాంతుల్ని కావలించుకుని మెరిసే తుహినంలా నవ్వుతూ తిరుగాడే అతన్ని చూసినప్పుడల్లా నా కనిపిస్తూంటుంది - అతని కనిపించని స్వప్న ప్రపంచం నిజమనీ, యీ రోగాల దగాకోరు నకిలీ లోకం అబద్ధాల కోరనీ...!

అడవికి అంకితమైన అతణ్ణి చూస్తుంటే అద్భుతమైన ప్రకృతి నగ్న మనోజ్ఞంగా మనల్ని పలకరిస్తున్నట్టనిపిస్తుంది.

అతని ఇటుక రంగు ఖద్దరు లాల్చీ గుబురు గడ్డం, భుజాన సంచీ కింద అంచుల్మాసిన ముతక పైజమా... అవి అవన్నీ అతను కాదు. అతను అసలేమిటో యెవరికీ తెలీదనిపిస్తుంది.

ప్రతిరోజూ ప్రత్యక్షించే ప్రదోష సంధ్యలో అడవి తనలోకి పీల్చేసుకునే సూర్యబింబాన్ని దూరంనించీ చూసే మౌన ప్రేక్షకుడిలా అతన్ని యెప్పుడూ దూరం నించి చూడ్డమే.

అతనో ప్రహేళిక నాకు.

సమాధానం కోసం సరైన అదను కోసం, నా మర జీవితంలోంచీ కొంత సమయాన్ని మదుపు చేసుకున్నానెప్పుడో..!

నిన్న..... నిన్నసాయంత్రం మంజునాథ వైన్ స్టోర్స్‌లో.... కౌంటర్ వెనక నిలబడి... "ఇంన్నొందు క్వార్టర్కొడి" (యింకో క్వార్టరివ్వండి...!) అని అతనన్నపుడు,అతన్ని బాగా దగ్గర్నుంచి నిశితంగా చూశా.

నల్లటి రాతిని చీల్చుకు దూకే జలపాతంలా తెల్లటి పాయ అతని కుడి గడ్డంలో అక్కడక్కడా నెరిసిన మీసాలు..... నలభై నలభై రెండేళ్లుండొచ్చు. బలంగా పొంగిన

భుజాలు గులాబీ రంగులో మెరిసిపోతూన్న వేళ్ళూ కాంతుల్నన్నిట్నీ చప్పరించేసే సాయంత్రాల్లాంటి కళ్ళూ.. మాసిపోయిన అద్భుతమైన పాత చిత్రంలా వున్నాడనిపించింది.

నిజమే... పొగ చూరిన గదిలో మదిలో మాసిపోయిన పాత క్యాలెండరు బొమ్మ జ్ఞాపకం గాయం మచ్చలాగా...!

పుండరీకాక్షప్పతో రాత్రి పార్టీ విషయం గురించి మాట్లాడ్డానికని వచ్చి కూచున్నా బ్రాందీ షాపులో పురండరీకాక్షప్ప ఆ షాపుకీ, పక్కన వున్న మిలటరీ హోటల్‌కీ యజమాని. పేపర్మిల్లు పర్చేజాఫీసరు డ్యాండేలీలో వుంటాడు. మిల్లుకి సున్నం రాయి అమ్మేందుకు - అదీ నాసి రకంది - ఆ పర్చేజాఫీసర్ని కొనుక్కుందికి నాలాంటి లఫూట్ గాళ్లు చేసే పనే నేనూ చేస్తూ, యీ పల్లెలో అడవి మధ్య ఆ ఆఫీసర్ని చుక్క, ముక్క, పక్కా అన్నీ యేర్పాటు చేసేందుకు.. షాపులో పుండరీకాక్షప్పతో మాట్లడు దామని కూచున్నపుడు .... అప్పుడు.... అతనొచ్చాడు.

మా దుర్మార్గాల రొచ్చుల పుచ్చుల మచ్చలను తనకు తగలకుండా తప్పించుకుని, నేను చూస్తూండగానే వచ్చాడు. కౌంటర్వెనక నిలబడి "రం ఒందు క్వార్టర్కొడి" (రం ఒక క్వార్టరివ్వండి) అన్నాడు.

యిల్లే కుళ్లిక్కా? పార్సిల్మాడ బేకా? (యిక్కడ తాగడానికా.... పార్సిలా?) షాపులో పన్చేసే కుర్రాడు బసవ అడిగినపుడు, గుబురు చెట్ల మధ్యనించీ చీల్చుకొచ్చే సూర్య కిరణాంలా నవ్వుతూ, ఫ్రిడ్జ్ వేపుచూపించాడతను.

బసవ, మరేమీ మాట్లాడకుండా ఓ జిడ్డుపట్టిన గాజు గ్లాసూ, ఫ్రిడ్జ్‌లోంచీ ఓ నీళ్ళసీసా, ఓ ఖోడేస్ రం క్వార్టరూ కౌంటర్మీదుంచాడు.

నీళ్ళ సీసాలోంచీ నీళ్లు గ్లాసులో కొంచి గులాబీ వేళ్లని ఆ గ్లాసులో ముంచీ రెండు నిమిషాలు కడిగాతడను. నీళ్లు నల్లగా మకిలి పట్టిపోయాయి. గ్లాసెత్తి గ్లాసులో నీళ్లలోంచీ బైటి రోడ్డుని చూసి నెమ్మదిగా బైటికెళ్ళి ఆ నీళ్లు పారబోసి, లాల్చీ జేబులోంచీ తెల్లని కర్చీఫ్ తీసి, గ్లాసుని ఓ నిముషం పాటు తుడిచాడు.

నేను డ్యాండేలీ వచ్చినపుడల్లా అతన్ని చూస్తూనే ఉంటాను. దగ్గరగా చూడ్డం యిదే మొదటిసారి. అతని గురించి చాలా చాలా విన్నా, ఎప్పుడో సూపా డ్యాం కట్టడానికని అక్కడికొచ్చిన ఇంజనీర్లలో ఓ చిన్న ఇంజనీరట అతను. ఆరు నెలలు పనిచేశాట్ట. ఓశుభోదయాన రాజీనామా చేసి యీ మారు మూల పల్లెలో యింకో మూల యిల్లు అద్దెకు తీసుకుని వుండడం మొదలు పెట్టాట్ట.

ఒంటరి... తన బ్రతుకేమో తన్దీ...ఇ ంకొకళ్ళ జోలికి వెళ్ళడు. తనే ఒండుకుంటాట్ట. చిన్న పిల్లల్తో ఆట్లాడ్తాడట. యింటి నిండా పుస్తకాలు పరుచుకునుంటాడుట.

రెండో క్వార్టర్లో ఒక రౌండేసుకుని గట గటా తాగేసి సీసా మూత పెట్టి భుజానికున్న సంచీలోకి జారవిడిచి పుండరీకాక్షప్పకి డబ్బు లిచ్చేసి సాయంత్రం చల్లిన రంగుల్లో కలిసి పోయాడు.

"హుచ్చ (పిచ్చివాడు...!) అన్నాడు పుండరీకాక్షప్ప. 'ఎవర్రా పిచ్చ వాళ్ళని' అడగాలినిపించింది.

మర్నాట్రోజు యెల్లాపూర్ వెళ్తోంటే అడవిలో ఓ చెట్టు కింద ముంగాళ్ల మీద కూచుని తీక్షణంగా దేన్నో చూస్తూ కనిపించాడు.

యిక కుతూహలాన్ని ఆపుకోలేకపోయా. కుతూహలాన్ని మనిషి చంపేస్తూవెళ్లంటే యిన్నిన్ని నాగరికతలు వెలసిల్లేనా.....అసలు..!

అతని కోసం మదుపుచేసుకున్న సమయమొచ్చింది.

జీపాపి నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్ళి అతని వెనగ్గా నిల్చున్నా

ఓ కొండబల్లి ఓ పెద్ద మిడతని పట్టుకున్న దృశ్యాన్ని తదేకంగా చూస్తున్నాడతను.

"హలో" పిలిచా.

నా వునికి గ్రహింపు వున్నవాడిలాగా వెనక్కు తిరిగా నన్ను చూసి నవ్వి తల వూపాడు నా హలోకి జవాబుగా.

నన్ను నేను పరిచయం చేసుకున్నా.

చెయ్యి మృదువుగా నొక్కి వదిలేశాడు. నేను చాలా రోజులుగా పరిచయం వున్నట్లు తనని తాను పరిచయం చేసుకుంటాడనుకున్నా... వూహూఁ... 'చెప్పండి'... అన్నట్లు చూశాడు.

"ఏమిటీ అంత తీక్షణంగా చూస్తున్నారు?" ఇంగ్లీష్‌లో అడిగా. (మా ఇద్దరి సంభాషణ ఇంగ్లీష్లోనే సాగింది)

"సృష్టి రహస్యాన్ని!" అన్నాడు బల్లిని, మిడతనీ చూస్తూ.

"ఇంత బాహాటంగా కనబడేది రహస్యమెలా అవుతుంది?" అన్నా.

"ఒకానొక రహస్యానికి సైన్ పోస్ట్ లాంటిదీ దృశ్యం అనుకోండి పోనీ" అన్నాడు.

"ఎట్లా?"

" ఆ మిడత చచ్చిపోతుందంటారా?" అనడిగాడు.

చూశాను. నిజానికి చెప్పడం కష్టమే.! మిడత బాగా బలంగా ఉంది. దాన్ని మింగడానికి బల్లి నోరు తెరిస్తే అది తన్నుకుని బైటికెగిరిపోవచ్చు లేదూ సూదుల్లాంటి దాని కాళ్లు గుచ్చే గుచ్చుడుకి బల్లే దాన్నొదిలేయొచ్చు. మింగలేక బల్లి చచ్చినా చావొచ్చు.

"చెప్పలేను" నవ్వుతూ అని "అందులో సృష్టిరహస్యమేముందీ?" అన్నా.

"మరణంలోనే సృష్టి" అని దీర్ఘంగా మిడతా, బల్లీ కల్సిపోయున్న దారుణ దృశ్యాన్ని తన్మయత్వంతో చూడసాగాడు.

"కొద్దిగా విడమరిచి చెబుతారా?" అనడిగా.

"యస్.... మనకు యీ ప్రకృతిలో తెలీని విషయం ఒక్కటే వుంది. అది మరణం. దాన్ని రహస్యాన్ని మనం భేదిస్తే, సృష్టి రహస్యం తెల్సిపోతుంది. మరణం సృష్టికి వాకిల్లాంటిది. దాన్ని దాటిపోతే మనం సృష్టిలో కడుగు పెడతాం. మనం అంటే

మన మనస్సు అన్న మాట.... అంటే జ్ఞానం అనుకోండి..."

అర్థం అయ్యీ కాక ఏమిటోగా అన్పించింది.

పుట్టుకా మరణాల్ని ముందుది వెనకా వెనకది ముందూ చేసినట్టున్నారు?" అన్నా.

"లేదు. లేదు.. జ్ఞానం లోకం యావత్తూ పుట్టుకే, సృష్టి అనే భ్రమంలో వుంది. పుట్టుక అంటే మనికి చూచాయగానైనా తెల్సు. కానీ మరణం గురించి లేశ మాత్రం కూడా తెలీదీ జ్ఞానలోకానికి. నా దృష్టిలో సృష్టి అంటే వునికి అని... పుట్టుకని కాదు. వునికికి మూలం మృత్యువు ... కాదా...? చెప్పండి? ప్రకృతి లోలకం అవిశ్రాంతంగా ఆడుతూనే వుంటుంది. ఆడే బంతి అస్తిత్వం... అది వేలాడే సూత్రం మరణం...!

ఆ దారం దారి పట్టుకుని అలా వెళుతూ, మరణం యెక్కడ దేనికి తగులుకుని వేలాడుతుందో మనం కనుక్కోవచ్చున్నమాట...! మరణం లేకుంటే అస్తిత్వం?!... నేను సరిగ్గా చెప్పలేక పోతున్నా... క్షమించండి...!" అని భుజానికి వేలాడుతోన్న సంచీ లోంచీ నలిగిపోయున్న సిగరెట్టు పెట్టె తీసి తానోటి వెలిగించుకుని నా వేపుచూశాడు.

తీసుకుని థాంక్స్ చెప్పి, "మీకు పని లేకపోతే రండి యెల్లాపూర్ వెళ్దాం.. అక్కడ నాకో పది నిముషాలు పని... దాంతర్వాత మనం బార్లో కూచుని నిమ్మళంగా మాట్లాడుకుందాం" అన్నా.

"సారీ.... తాగడానికే అయితే నా దగ్గరే రం వుంది. యిక్కడే తాగుదాం... మాట్లడ్డానికి యీ నిశ్శబ్దపు పరిమళంలో హాయిగా యిక్కడే... యీ గడ్డివాసనా.. ఏనుగులద్దెలూ.... ఆకుపచ్చటి ఆకుల చీకట్లూ... ఈ ఆకుల చీకట్ల మధ్య యీ అశ్లీల పరిమళాలూ.... సారీ... అరెరే...యేమీ అనుకోకండి.... నేనంతే..."

కొన్ని పొడి పొడి వాక్యాలు మాట్లాడాడు. యే వాక్యము పూర్తిగా మట్లాళ్లేదు కాని భావం నాకర్థమై పోయింది.

పక్కన టపాటపా శబ్దమైంది. మింగడానికి నోరు తెరిచింది బల్లి. ఆ అదను కోసమే చూస్తున్న మిడత తన్నుకుంటుంది. టపటపా బల్లి వెల్లకిలా అయింది. తెల్లటి దాని ఉదర భాగం అసహ్యంగా నున్నగా కనబడుతోంది. చెంగున బైటికి దూకింది మిడత. యెండిన ఓకొమ్మ మీద కూచుంది.

"అదీ చూడండి... బల్లి వునికికి మిడత మృత్యువు అవసరం. మిడత వునికికీ మృత్యువు తప్పించుకోడమౌసరం. అటు యిటూ ఎటైనా అస్తిత్వానికి మృత్యువుకీ చాలా దగ్గర సంబంధముంది. కాదంటారా...?"

"కాదన్డానికందులో యేముంది? అది అందరికీ తెల్సిన విషయమే"- ఇబ్బందిగా నవ్వి, "సృష్టి రహస్యం" అన్నా. తేలిగ్గా తీసి పారేస్తున్నట్లు వ్యంగ్యంగా...!

అతనదేమీ పట్టించుకునేస్థితిలో లేడు పూర్తిగా ప్రకృతిలో కలిసిపోయాడు.

"అవునవును.... యస్.... ఒక్కసారి వెళ్లి టూటాంఖమూన్ గోరీలో వెళ్లి పడుకుంటే...పడుకుని ఆ మరణ పరిమళాన్ని పీలిస్తే తెలుస్తుంది" అన్నాడు.

అప్పుడనిపించింది నిజంగా అతడు పిచ్చి వాడేమోనని. అనుమానంగా అతని వేపు చూశా. నిర్మలంగా పవిత్రంగా మామిడి తోరణం కట్టిన గుమ్మంలా వుందతని ముఖం.

"ఇపుడు మిడతలోకి నేనూ, నాలోకి మిడతా మెటం సైకోసిస్ (పరకాయ ప్రవేశం) జరిగితే యెట్లా వుంటుందంటారు...?"

పళ్ళికిలించూరుకున్నా.

"నేను మిడతై మాట్లాడతా... భావ ప్రకటనకు భాష అవసరం కదా... అందుకనే అన్న మాట. మిడత నాలోకి చేరితో నా మెదడు నా భాష నా నాలుక ... తో మీకు చెప్పొచ్చన్న మాట... మిడత నాలోకి చేరితే నా మెదడు నా భాష నా నాలుక...తో మీకు చొప్పచ్చనమాట... వునికి యెంత ఆనందంగా వుంటుందో అంటే మృత్యువువంటే ఆనందమేనేమో..?" తనకు తాను మాట్లాడుకున్నట్టుగా అన్నాడు.

నాకు భయమేయడం మొదలైంది.

"భయపడ్తున్నారా?... పిచ్చివాడిననని...? కాదు యీ లోకం పిచ్చిది. ఇప్పుడున్న జ్ఞానం పిచ్చిది"... గట్టిగా నవ్వాడతను.

ఆ అరణ్యపు నిశ్శబ్దంలో అతని నవ్వు మార్మోగుతుంది. అలలు అలలుగా తెరలుతెరలుగా పొరలు పొరలుగా...!

నా నిజ వ్యక్తిత్వం మీద పరచిన యాంత్రికత్వపు పొరల్ని యెవరో ఒక్కటొక్కడిగా వలుస్తూన్న భావన.

నేను...... నేనాఖరికి నగ్నమౌతానా? యేదో తెలీని సిగ్గు భావం కలుగు తోందెందుకని...?

చుట్టూ చూశా. అద్భుతమైన రంగుల్ని నినాదాలుగా మార్చి అరుస్తోంది అడివి. మరణం చెర తప్పించుకున్న మిడత ఇంకా అలాగే యెండిపోయిన కొమ్మ మీదే కూచునుంది. భావం తెలీని చూపుల్తో గుడ్లు మిటకరిస్తూ చూస్తోంది బల్లి.

ఇంతలో అటువేపు నుంచీ వస్తూన్న మోటార్ సైకిల్నాపి యెక్కి, "మళ్ళీ కలుద్దాం...! అని.... నేనుతేరుకునే లోపలే ఆ అడవి మింగేసిన రోడ్డు గుండా మాయమై పోయాడతను సాయంత్రపు సూర్యడిలాగా.

బల్లీ, మిడతా గూడా మాయమైపోయాయి.

ఈసారి అతన్ని మందు మీదున్నప్పుడుపట్టాలి' అని ధృడంగా నిశ్చయించుకుని అక్కడ్నించీ కదిలా... ఆ తర్వాత అతని గురించి మర్చి పోయి... పని కాగానే వూరెళ్ళిపోయా.

ఒక నెలన్నర పాటు తిరిగీ డ్యాండేలీ రావడం వీలుపడలేదు. వచ్చీ రాగానే స్ఫురణకు తట్టిన మొదటి విషయం అతను.

పుండరీకాక్షుడి 'గుడి'లో తీర్థం తీసుకుంటూ కన్పిస్తాళ్ళే అనుకుని నవ్వుకుని, పేపర్మిల్లులో దూరిపోయా యాంత్రికంగా...

సాయంకాలం మంజునాథ వైన్స్‌లో కూచుని పుండరీకాక్షుడి నడిగా అతనెక్కడని.

"హాఁ...! దీర్ఘంగా నిట్టూర్చి.

"ఆ పిచ్చి ముండాకొడుకు పక్కింటి నంజుండను హత్య చేసి ఠాణాలో కూచున్నాడు" అన్నాడు.

"హత్యా....?"

"అఁఅఁ..! హత్యే....! ఆ అవిటి నంజుండను యేదో సూదిమందేసి చంపేసినాడు.. నిన్ననే...!"

ఒక్కసారిగా నా చుట్టూ వున్న ప్రపంచాన్ని నమ్మబుద్ధి కాలేదు. యెక్కడో యేదో లోపించింది. పసి పాపలాగా నిర్మలంగా వుండే అతనేమిటి.... హత్య...?! అదీ ఓ అవిటి వాడిని హత్య చేయడమేమిటి....?! నో...సంథింగ్‌గ్రాంగ్ సంవేర్.....అనుకుని.

"యెక్కడున్నాడతనిప్పుడు?" పుండరీకాక్షప్ప నడిగా.

'ఇంకెక్కడ... ఠాణాలో, పోలీసులు కూడా ఆ పిచ్చోడిని చూస్తే భయపడ్తున్నారు" గట్టిగా నవ్వుతూ చెప్పాడు పుండరీకాక్షుడు.

చూడాలి - అతన్ని అవసరంగా చూడాలి. లేచి జీప్ స్టార్ట్ చేసి పోలీస్టేషన్దగ్గరాపాను. యెస్సై వున్నాడు. అతన్నిచూడాలన్నపుడు ఎగాదిగా చూసి స్టేషన్వెనకాలున్న సెల్ దగ్గరికి తీసుకెళ్లాడు.

సాయంత్రపు గాలుల్తో పరిగెత్తుతూ వాగుల్నీ వంకల్నీ తన వేళ్ల మధ్య నించీ జార్చే అతను.. ఆ కటకటాల వెనుక ఇరుకులో, మురికిల్లో వుక్కిరి బిక్కిరై అసహనంతో కొట్టుమిట్టాడ్తూంటాడనుకున్నా.

వుహూఁ.... విహాయసంలో విహంగంలాగా వున్నాడతను. అదే యిటుక రంగు ఖద్దరు లాల్చీ.... నలిగిన తెల్ల పైజామా...!

యింకా హాయిగా స్వేచ్ఛగా... నిర్మలంగా... యేమిటీ వైరుధ్యం.....?

నన్ను చూడగానే హాయిగా నవ్వాడు. కటకటాల వెనకల్నించీ గులాబీరంగు అర చేతులు చాచి నా చేయిని పట్టుకుని, 'హలో' అన్నాడు ఆప్యాయంగా, యెన్నో యేళ్ళొగా పరిచయం వున్నట్టు...!

"యేమిటి....యేమిటిదంతా?!" అడిగా.

"యేదీ...? నేనిక్కడుండమా...? లేక నేనిక్కడుండడానికి కారణమా...?" నవ్వుతూ అడిగాడు.

"రెండూ ... అదీ....యిదీ.... చెప్పండి. అస్సలు మీరేమిటీ....హత్యేమిటీ.... నేను జీర్ణించుకులేకపోతున్నా. దయచేసి చెప్పండి.." ఆయాసంగా అడిగా.

"చెబుతా... చెబుతా.. ముందు ఓ సిప్ మందు కావాల్నాకు... వీళ్లనడిగితే నన్ను చూడగానే నరక లోకపు సైతాన్ని చూసినట్లు చూస్తారు... సిగరెట్లిస్తారు కానీ మందివ్వట్లే... మీ దగ్గిరేమన్నా రమ్మొందా...? ప్లీజ్ ఒక్క సిప్..... అంతే.."

"లే... లేదు. తెస్తాను.. కానీ మీరు జరిగింది చెప్తానంటేనే అంతే..."

"చెబుతా..... అసలు నంజుండను తెల్సా మీకు... తెలిసుండే అవకాశం లేదు లెండి. అతను.. ఈ చైతన్య ప్రపంచమనే గోరీలో వూపిరి పీలుస్తూన్న శవంలా వుండేవాడు. ఈ భూగోళం క్యాన్వాస్మీద నాగరికతలు చిత్రించిన సరస్వతీ నదీ ఛాయా చిత్రం. అతను పక్షిలాంటి మనస్తత్వం కలిగిన వాడు. ఆకాశం భూమీ కలిసే అంతరాళం ఆ పక్షి గమ్యం... కానీ రెక్కలు కత్తిరించబడినాయి... ఇరవై ఐదేళ్ళ వయస్సు... అతని కళ్ళల్లో ఉధృతంగా ప్రవహించే చైతన్యం చూసేవాడిని. అతడి పురి తిరిగిన కండల్లో పడమటి కనుములు కనిపించేవి నాకు.. హరితారణ్యంలాగా వికసించుండే వాడు.... ఇంటి కప్పుకు పెంకు కప్పుదామని ఆరు నెల్ల క్రితం పైకెక్కి జారి క్రింద పడి నుడం విరిగి కాళ్లు రెండూ పడిపోయి యెండిపోయిన సముద్రపు మచ్చలాగా మిగిలిపోయాడు. నెల రోజులు అటూ ఇటూగా గడిచాయి. తర్వాత అతడి పక్క బైటికి మారింది. ఆకలేస్తే తినటానికి భయపడ్డం మొదలుపెట్టాడు. అమృత తుల్యమైన అన్నాన్ని చూడగానే అతని కళ్లల్లో విపరీతమైన భయం కనబడేది... ఇక్కడ ఈ మారుమూల.. బెడ్ప్యానంటే యెవరికి తెలుసు చెప్పండి.. ఓ చేట... అందులో మోదుగాకులు. అదీ అతని పాయిఖానా... అసహ్యంతో తలపక్కకి తిపుకు నిలుచున్న భార్యను చూడలేక... మౌనంగా రోదిస్తూ.... శబ్దం బైటికి రాకూడదని నోట్లో అరచేతిని కొరుక్కుంటూ.. నరకపు పై మెట్టు మీదున్నవాడిలా హింసించబడే వాడు.. మలమూత్రాలుపక్కలోనే, అన్నం నీళ్లూ తీసుకుంటే అవి రెండూ తప్పనిసరి... అని శుష్కించడం మొదలుపెట్టాడు. నిజమే మరి .... మూడో నెల తన కళ్ల ముందే తండ్రీ భార్యా లోపలికెళ్ళి తలుపేసుకుంటూంటే నాలుక కొరుక్కుని తన రక్తం తనే తాగాడు.. అతని భార్య తప్పు గురించి నేను పట్టించుకోలేదు. అతని తండ్రిది యే నీతీ అని అడగదలచ్చుకోలేదు... నేనాలోచించిందల్లా ఒక్కటే... విముక్తి నంజుడకి విముక్తి... ఎగర్లేని ఆ పక్షికి రెక్కలు మొలిపించాలి.. అంతే.. అదే నేను చేసింది. ఆయాసంతో ఆగాడతను.

అతని కళ్లు ఆనందంతో మెరుస్తున్నాయి. ఓ ఖూనీకోరు పైశాచికానందం కాదది.... మొదటిసారి అమ్మ బొమ్మ గీచిన పసిపాప కళ్లల్లో కదిలే ఆనందం..

"అంటే నంజుండని చంపి, అతనికి విముక్తి కలిగించానని ఆనందిస్తున్నారా...?

"దయచేసి చంపడం అన్నమాట వాడకండి" తీవ్రంగా అన్నాడు.

"ఒకవేళ భవిష్యత్తులో వైద్య సహాయంతో నంజుండకి కాళ్ళొచ్చుంటే అన్న ఆలోచన మీకు కలగలేదా?" సూటిగా అతని కళ్ళలోకి చూస్తూ అడిగా.

"కాళ్లొచ్చినా అతని శరీరానికి రావొచ్చు నేమో కాని విరిగిపోయి ముక్కలు చెక్కలైంది అక్కడ అతని ఆత్మ."

"నేనొప్పుకోను మీ వాదాన్ని"

"ఒకరి మెప్పుదల కోసం.... ఒప్పుకోడం కోసం చెయ్యలేదు నేనీ పనిని.. నంజుండ కోసం... నా కోసం..."

"మీ కోసమా.... అంటే...?!"

"అతని రక్తనాళంలోకి నేనింజక్షనిస్తుంటే అరమోడ్పు కన్నులతో అతను అతి స్పష్టంగా అన్న మాట తెలుసా మీకు...?" 'నాకు చాలా ఆనందంగా వుంది సార్.... అని నంజుండ అన్న వాక్యంలో ఈ ప్రాకృతిక శృంఖలాలు ఒక్కటొక్కటిగా తెగి పడుతూన్న భావన... అతని కనెప్పలు రెండూ శాశ్వతంగా మూసుకున్నప్పుడు.. అప్పుడు ఆఖరి సంకెల తెగిపడిన నిశ్శబ్ద శబ్దం విన్నాను... ఆ నిశ్శబ్దంలోంచే నేను అన్వేషిస్తున్న సృష్టి చైతన్య రహస్య గానాన్ని విన్నాను ... జీవితం నడిచిన అడుగుల చప్పుడు సంగీతం అది... తునకలు తునకలుగా విశ్వవ్యాప్తమైన అద్భుత ప్రాచీన స్వర తేజస్సది.. కాంతిస్వరమది. మరణ మధురిమ అది...!" అరమోడ్పు కళ్ళతో చెప్పాడతను.

వింటూన్న నాకు ఒళ్లంతా చెమటలు పట్టి నోరంతా యెండిపోయినట్టనిపించి.. "నువ్వు పిచ్చివాడివి" అని అస్పష్టంగా గొణికి వెనక్కి తిరిగా.

పదడుగులువేసి అతన్ని ఆఖరిసారన్నట్టుగా వెనక్కి తిరిగిచూశా.

మసక చీకట్లో ఆ యిరుకు గదిలో ఆ కటకటాల వెనక అస్పష్టంగా కనబడ్తూన్న అతను ఎప్పుడో కాలానికి తెలీని ఓ అద్భుత చిత్రకారుడు గీస్తూ గీస్తూ ఆపేసిన ఓ అసంపూర్ణ చిత్రంలా కనిపించాడు. ✦

***(రచన ఇంటింటి పత్రిక : ఫిబ్రవరి 1999)***